నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: మేడ్చల్ సబ్‌స్టేషన్ పరిధిలోని కంట్రీ క్లబ్ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల నరికివేత కారణంగా శనివారం పట్టణంలోని పలు కాలనీలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ శశిధర్‌రెడ్డి తెలిపారు. సాయిబాబా నగర్, ఎయిర్‌ఫోర్స్ కాలనీ, రైల్వే స్టేషన్ రోడ్డు, వీకర్ సెక్షన్, ఏకలవ్య నగర్, హరిజన వాడ, టీచర్స్ కాలనీ, కంట్రీ క్లబ్, సరస్వతి నగర్, సత్యనారాయణ కాలనీ, కటిక బస్తీ, హ్యాపీ నగర్‌లలో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ ఉండదని ఏఈ వివరించారు.

పోచారం పరిధిలో...

పోచారం: విద్యుత్ తీగలకు తాకుతున్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ప్రదీప్ కుమార్ తెలిపారు. ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జోడిమెట్ల క్రాస్ రోడ్, అన్నా నగర్, కాకతీయనగర్, డాక్టర్స్ కాలనీ, అరుంధతి, స్వర్ణగిరి, వైష్ణవి కాలనీలు, చౌదరిగూడ ప్రాంతాలకు, మధ్యాహ్నం 1 నుండి 1:30 గంటల వరకు నారపల్లి, మహాలక్ష్మీనగర్, సప్తగిరికాలనీ, సురేందర్‌రెడ్డినగర్, బాబానగర్, గణేష్‌నగర్ ప్రాంతాలకు, మధ్యాహ్నం 3 నుండి సాయంత్రం 4:30 గంటల వరకు కొర్రెముల, చౌదరిగూడ, వెంకటాపూర్, మక్త, తేనుగూడెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు.

పరిసరాల పరిశుభ్రతతో పరిపూర్ణ ఆరోగ్యం



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న చైర్ పర్సన్ ప్రణీతాగౌడ్

కీసర: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవని తద్వారా పరిపూర్ణ ఆరోగ్యం కూడా సిద్ధిస్తుందని దమ్మాయిగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్ అన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అహ్మద్‌గూడ ఆర్‌జీకేకాలనీ 3వ వార్డులో కమిషనర్ నాగమణి, స్థానిక కౌన్సిలర్ కొత్త హేమలత శ్రీనివాస్‌గౌడ్, ఆర్‌జీఏ బస్తీ దవాఖాన వైద్యురాలు అలేఖ్య , ఏఎన్‌ఎం విజయరాణి, అంగన్‌వాడీ టీచర్లు, మహిళాసంఘాల ఆర్‌పీఎస్ మున్సిపల్ సిబ్బందితో కలిసి పర్యటించారు. వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభు, వార్డు ఆఫీసర్స్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

మేడ్చల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన ఆర్థిక సాయం చెక్కులను మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి కౌన్సిలర్‌లతో కలిసి మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం అందజేశారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి చెందిన 9 మందికి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ప్రభాకర్, కౌన్సిలర్లు బాలరాజు, జైపాల్‌రెడ్డి, కమిషనర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

శామీర్‌పేట: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యంతో అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని శుక్రవారం శామీర్‌పేట మండలం, అలియాబాద్ ప్రభుత్వ పాఠశాలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ప్రభుత్వం అందించే వసతులను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు.

వైద్య శిబిరానికి మంచి స్పందన



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

పోచారం: అన్నోజిగూడలోని ఎల్ఎన్ కాలనీలో ఈఎస్ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 170 మంది రోగులను వైద్యులు పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరాన్ని చైర్మన్ కొండల్‌రెడ్డి పర్యవేక్షించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కౌన్సిలర్ రాజశేఖర్, సాయిరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు అక్రమ్ అలీ, వైద్య బృందం, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి



మృతుడు లక్ష్మయ్య (ఫైల్)

ఘట్‌కేసర్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మరణించిన సంఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో జరిగింది. ఎస్ఐ శ్రీకాంత్ సమాచారం మేరకు.. ఎదులాబాద్ గ్రామానికి చెందిన కొమ్ము లక్ష్మయ్య ఈ నెల 17న భార్య యాదమ్మతో కలిసి ఘట్‌కేసర్ నుంచి ఎదులాబాద్‌కు వెళ్తుండగా ఎన్ఎఫ్‌సీ నగర్‌లోని మదర్ థెరిస్సా కళాశాల సమీపంలో పాలవ్యాన్ ఢీకొట్టింది.దీ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన లక్ష్మయ్యను చికిత్స కోసం ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరిప్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈ మేరకు డ్రైవర్ సుదర్శన్ నిర్లక్ష్యంగా వ్యాన్‌ను నడిపినందునే మరణించినట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం శవాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఖాళీగా రైతుబజార్.. రోడ్లపైనే వ్యాపారాలు!

● రోడ్లపై వ్యాపారాలతో ప్రజలకు తప్పని ఇబ్బందులు ● అక్రమ పార్కింగ్‌లకు అడ్డాగా మారిన వైనం ● పట్టించుకోని అధికారులు, పాలకులు



మార్కెట్ రోడ్లపైనే ఏర్పాటు చేసుకున్న దుకాణాలు

మేడ్చల్: కొన్ని ప్రాంతాల్లో స్థలం లేక తప్పనిసరి పరిస్థితుల్లో రోడ్లపై వ్యాపారాలు చేయడం చూస్తాం. మేడ్చల్‌లో మాత్రం అందుకు భిన్నమైన వాతావరణం కనపడుతుంది. వ్యాపారాలకు కావాల్సినంత స్థలం సహా సకల వసతులు ఉన్నా మేడ్చల్ మార్కెట్‌లో రోడ్లపైనే వ్యాపారాలు సాగిస్తుంటారు.

- మేడ్చల్ మార్కెట్ ప్రధానంగా వివేకానంద విగ్రహం నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు ఉన్న రోడ్డులో ఉంటుంది. వివేకానంద విగ్రహం నుంచి రైల్వే స్టేషన్ రోడ్డు, అంబేడ్కర్ విగ్రహం నుంచి రైల్వే స్టేషన్ రోడ్డులో ప్రధాన వ్యాపార సముదాయాలు ఉంటాయి.
- వివేకానంద విగ్రహం నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు ఉన్న రోడ్డు ప్రధాన మార్కెట్ సాగుతుంది. ఈ రోడ్డులోనే అన్ని రకాల వ్యాపార దుకాణాలు ఉన్నాయి. ప్రతి వస్తువు ఈ రోడ్డులోని మార్కెట్‌లో లభిస్తుంది. అన్ని రకాల కిరాణా సామాన్లు, వంట సామగ్రి, దుస్తులు, బంగారం, ఇతర వస్తువులు, పూలు, పండ్లు, మటన్, చికెన్, చేపలు, ఫర్నిచర్, ఫోన్లు, మందులు, స్వీట్లు వంటి అన్ని రకాల సామగ్రి లభించే మార్కెట్ ఇది. ఈ మార్కెట్ ఎప్పుడూ రద్దీగానే ఉంటుంది. దీంతో శాశ్వత దుకాణాల ముందు, రోడ్లపై చిల్లర వ్యాపారులు యథేచ్ఛగా తమ స్టాల్స్ తోపుడు బండ్లపై ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు సాగిస్తున్నారు. దీంతో మార్కెట్ రోడ్డు మీదుగా వెళ్లాలంటే కష్టంగా మారుతుంది. దీనికి తోడుగా మార్కెట్ రోడ్డు మధ్యలో అక్రమంగా ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేయడంతో ఇరుకుగా మారి ఇబ్బందులు ఎక్కువ అవుతున్నాయి. గతంలో రోడ్డు మధ్యలో డివైడర్ ఏర్పాటు చేయగా కొంత మంది రాత్రికి రాత్రి తమ స్వార్థ ప్రయోజనాల కోసం దాన్ని కూల్చివేశారు.

రైతుబజార్ ఉన్నా...

- మేడ్చల్‌లో రైల్వే స్టేషన్ రోడ్డులో వ్యాపారులు, వినియోగదారుల కోసం 10 ఏళ్ల క్రితం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో రైతుబజార్ పేరుతో సముదాయాన్ని నిర్మించారు. సముదాయాన్ని రెండు భాగాలుగా విభజించి ఒక్క దాంట్లో మాంసాహార దుకాణాలు ఏర్పాటు చేశారు. మిగతా సముదాయం ఖాళీగా ఉంది. దాంట్లో సమీపంలో నివాసం ఉంటున్న వారు, రాజకీయ నాయకులు, బడాబాబులు తమ కార్లు పార్కింగ్ చేస్తూ దానిని పార్కింగ్ అడ్డాగా మార్చారు. ఓ రాజకీయ నాయకుడి అండతో ఓ వ్యాపారి ఎలాంటి రుసుములు చెల్లించకుండా వ్యాపారం కోసం వినాయకులను షెడ్లలో ఏర్పాటు చేసుకున్నాడు. మార్కెట్‌కు దగ్గరగా ఉండటంతో రైతుబజార్ మందుబాబులకు అడ్డాగా మారింది. అక్కడే తాగడం అక్కడే నిద్ర పోవడం, కుదిరితే అసాంఘిక పనులకు పాల్పడం చేస్తున్నారు. రైతుబజార్ ఆవరణ మొత్తం చెత్తమయంగా మారింది.
- మున్సిపల్ అధికారులు, మార్కెట్ కమిటీ అధికారులు పట్టించుకుని రోడ్లపై ఉన్న వ్యాపారాలను రైతుబజార్‌కు తరలించి పట్టణంలో ట్రాఫిక్ సమస్యను తీర్చాలనే వినతులు వెల్లువెత్తుతున్నాయి. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించి తగు చర్యలు తీసుకుంటేనే రైతుబజార్ ప్రజలకు ఉపయోగకరంగా మారుతుందనడం అక్షర సత్యం.





రైతుబజార్‌లో పార్క్ చేసిన కార్లు



పేరుకుపోయిన చెత్త

వృత్తి విద్యా కోర్సులతో భవితకు భరోసా

● సెట్విన్‌లో శిక్షణ పొందిన 300 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించిన అధికారులు
● 27 నుంచి కొత్త బ్యాచ్ ప్రారంభం : పీర్జాదిగూడ సెట్విన్ ఇంచార్జి వనజ



పరీక్షల కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ త్రిలేశ్వర్ రావు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో తెలంగాణ యూత్ సర్వీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సెట్విన్ సెంటర్‌లో హైదరాబాద్ నగరంలోని వివిధ సెట్విన్ కేంద్రాల్లో శిక్షణ పొందిన సుమారు 300ల మంది యువతీ యువకులకు శుక్రవారం నిర్వహించిన పరీక్షలను మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్ రావు, సెట్విన్ ఇంచార్జి వనజ కలిసి పరిశీలించారు. నేటి యువతకు సెట్విన్ ఓ వారధిలా మారి ఉద్యోగ, ఉపాధి మార్గాల వైపు అడుగులేసి విజయాలను సాధించడం సంతోషంగా ఉందన్నారు. పీర్జాదిగూడ సెట్విన్ కేంద్రంలో బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, మగ్గం వర్క్, టైలరింగ్, జూట్ బ్యాగుల తయారీ, ఏసి, రిఫ్రిజిరేటర్ తదితర-22 రకాల కోర్సులల్లో శిక్షణ పొందిన వారు స్వయం ఉపాధిని పొందుతున్నారని వనజ తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని కొత్త కోర్సులను ప్రవేశపెట్టేందుకు చర్యలను తీసుకుంటున్నట్లు ఇంచార్జి వనజ తెలిపారు. ఈ నెల 27 నుంచి కొత్త బ్యాచ్ ప్రారంభం అవుతున్నందున ఆసక్తి గల వారు. పూర్తి వివరాలకోసం 7207816959 నెంబర్‌ను సంప్రదించగలరని వనజ తెలిపారు.

చెరువుల సుందరీకరణపై ప్రత్యేక దృష్టి



చెరువు సందర్శిస్తున్న మేయర్, అధికారులు

బోడుప్పల్: చెరువుల సుందరీకరణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. హెచ్ఎండీఏ అధికారులతో కలిసి ఆయన శుక్రవారం బోడుప్పల్‌లోని చెరువులను సందర్శించి, స్థానిక సమస్యలు అడిగి తెలుసు కున్నారు. అనంతరం మేయర్ అజయ్ యాదవ్ మాట్లాడుతూ త్వరలో రా చెరువు, చింతల చెరువును సుందరీకరణ పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కబ్జాదారుల నుంచి పూర్తిస్థాయిలో చెరువులను రక్షించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండీఏ మేనేజర్ అఫ్రీన్, డీఈ జగన్ మోహన్‌రావు, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిశోర్‌గౌడ్, కార్పొరేటర్లు కొత్త చందర్‌గౌడ్, సింగిరెడ్డి పద్మారెడ్డి, కుంభం కిరణ్‌కుమార్‌రెడ్డి, పులకండ్ల హేమలతా జంగారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అవగాహన



ఈసీఐఎల్‌లోని ఎన్ఎస్ఐసీలో ఎస్సీ, ఎస్టీ హబ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం

కాప్రా: దేశంలో యువశక్తిలో అంతర్గతంగా దాగివున్న ఔత్సాహిక పారిశ్రామిక శక్తిని వెలికితీయడం కోసం కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో ఎంఎస్ఎంఈ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ మహిళలు, ఎంఎస్ఎంఈలు, స్టార్టప్, యువకుల కోసం ఈసీఐఎల్‌లోని ఎన్ఎస్ఐసీలో శనివారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. నేషనల్ ఎస్సీ, ఎస్టీ హబ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌తో పాటు జిల్లాల్లో కూడా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు నిర్వాహకులు. ఈ సదస్సుకు ఎన్ఎస్ఐసీ ఎస్సీ, ఎస్టీ హబ్ బ్రాంచ్ మేనేజర్ సురేష్, పంజాబ్ నేషనల్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ రేఖారావు, ప్రైస్ చారిటబుల్ ట్రస్ట్ సీఈవో ప్రభాకర్‌తో పాటు దాదాపు 18 మంది ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు హాజరయ్యారు.

ఉప్పల్ రింగ్ రోడ్డులో వాహన తనిఖీలు



వాహనాల డాక్యుమెంట్లను చెక్ చేస్తున్న డీసీపీ మనోహర్...

ఉప్పల్: ప్రతి వాహనదారుడు విధిగా తన వాహనానికి సంబంధించిన పూర్తి పత్రాలు తన వద్ద ఉంచుకోవాలని లేనిపక్షంలో వాహనాలను సీజ్ చేయనున్నట్లు డీసీపీ-1 మనోహర్ హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి ఉప్పల్ రింగ్ రోడ్డులో మల్కాజిగిరి ఏసీపీ శ్రీనివాస్‌రావు, ఇన్‌స్పెక్టర్ లక్ష్మీ మాధవి, అడిషనల్ ఇన్‌స్పెక్టర్ సూర్యానాయక్‌లతో కలిసి వాహనాల డాక్యుమెంట్లను చెక్ చేశారు. దాదాపుగా 150 వాహనాలు తనిఖీ చేసి సరైన పత్రాలు లేని వాహనాలకు ఫైన్ విధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్. రఘురాం, ఉదయ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

విద్య ప్రతి ఒక్కరి నైతిక హక్కు



సాక్షి స్కూల్ ఎడ్యుకేషన్ పేపర్లను విద్యార్థులకు అందజేస్తున్న నెమలి అనిల్‌కుమార్

మల్లాపూర్: విద్య ప్రతి ఒక్కరి నైతిక హక్కు అని, విద్యార్థులకు నెమలి సురేష్ ఫౌండేషన్ ఎప్పుడూ అందుబాటులో ఉంటుందని ఎన్ఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ నెమలి అనిల్‌కుమార్ అన్నారు. నెమలి సురేష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మల్లాపూర్ జిల్లా పరిషత్ హెస్కూల్లో 120 మంది 10 వతరగతి విద్యార్థులకు సాక్షి ఎడ్యుకేషన్ పేపర్‌ను సొంత డబ్బులతో అనిల్‌కుమార్ పంపిణీ చేశారు. ఏడాది పాటు సాక్షి ఎడ్యుకేషన్ పేపర్ 120 కాపీలను విద్యార్థుల కోసం ఏడాది చందాను తన సొంతగా రూ. 12 వేల చెక్కు రూపంలో 'సాక్షి' సర్క్యులేషన్ ప్రతినిధి భరత్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా నెమలి అనిల్ కుమార్ మాట్లాడుతూ సాక్షి ఎడ్యుకేషన్ పేపర్‌తో పదవ తరగతి విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులకు గతం ఏడాది కూడా సాక్షి ఎడ్యుకేషన్ పేపర్‌ను పదవ తరగతి విద్యార్థులకు ఇవ్వాడానికి సహకారం అందించానన్నారు. ఉన్నత లక్ష్యల కోసం విద్యార్థులు శ్రమించాలన్నారు. ఎన్ఎస్ఆర్ ఫౌండేషన్ విద్యా విషయంలో మీకు తోడుగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు యాదగిరిరెడ్డి, పీఆర్.మోహన్, కె.రాజేష్, మల్లికార్జున్, నవీన్, హరి, రఘు, విజయ్, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

27న పిల్లల ఉపకరణాల కోసం శిబిరం

మల్కాజిగిరి: వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలతో చదువుతున్న విద్యార్థులతోపాటు ఇతర చిన్నారులు ప్రత్యేక అవసరాలు (సీడబ్ల్యుఎస్ఎన్) గల వారికి ఉచితంగా ఉపకరణాలు అందించేందుకు ఈ నెల 27వ తేదీ మల్కాజిగిరిలోని బాలుర పాఠశాలలో గుర్తింపు కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. శిబిరానికి హాజరయ్యే వారు సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఆహార భద్రత కార్డు, ఆధాయ ధృవీకరణ సర్టిఫికెట్, ఇతర డాక్టర్ సర్టిఫికెట్స్‌తో పిల్లలను తీసుకొని తల్లితండ్రులు హాజరు కావాలన్నారు. వివరాలకు ఫోన్: 94926 93431, 93929 09770లలో సంప్రదించాలన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

కుషాయిగూడ: కుషాయిగూడలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో యువతకు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నారు. తరగతులు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. మూడు నెలల పాటుగా సెట్విన్ పాఠ్యాంశాల ఆధారంగా కంప్యూటర్ బేసిక్స్‌పై శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తారు.

నారపల్లిలో డ్రగ్స్ కలకలం

పోచారం: నారపల్లిలోని దివ్యానగర్‌లో డ్రగ్స్ కలకలం సృష్టించింది. దివ్యానగర్ నుంచి ఇతర ప్రాంతాలకు డ్రగ్స్ సరఫరా అవుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో స్టేట్ టాస్క్‌ఫోర్స్, ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలు గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం రాత్రి వరకు కొనసాగుతూనే ఉన్నాయి. ఇటీవల దివ్యానగర్‌లోని ఓ ఇంటిలో అద్దెకు ఉంటున్న వ్యక్తులు డ్రగ్ దందా చేస్తున్నట్లు తెలిసింది. తనిఖీల ప్రక్రియ ముగియగానే వివరాలు వెల్లడిస్తామని అధికారులు తెలిపారు.

యువతి అదృశ్యం

జవహర్‌నగర్: యువతి అదృశ్యమైన సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... అరవిందన్ తన భార్య, పిల్లలతో యాప్రాల్‌లో ఉంటున్నారు. వీరి కుమార్తె(17) మారేడ్‌పల్లిలోని ప్రభుత్వ బాలికల కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఈ క్రమంలో గురువారం ఉదయం కళాశాలకు వెళ్లిన యువతి సాయంత్రం ఇంటికి వచ్చింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో తండ్రి అరవిందన్‌కు ఫోన్ చేసింది. ఇంటికి వస్తున్నాను.. ఉండమని కుమార్తెకు చెప్పారు ఆయన. తండ్రి అరవిందన్ ఇంటికి వచ్చి చూసేసరికి కుమార్తె కనిపించలేదు. ఆమె ఆచూకీ కోసం పరిసర ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తండ్రి శుక్రవారం జవహర్‌నగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

గ్రామాల విలీనంపై భిన్నాభిప్రాయాలు

● మండల కేంద్రాలను మున్సిపాలిటీలుగా మార్చాలి
● మేజర్ గ్రామాలను పంచాయతీలుగా ఉంచలేని పక్షంలో మున్సిపాలిటీలుగా మార్చాలి
● గ్రామసభల్లో ప్రతిపాదనలు



పూడూర్‌ను మున్సిపాలిటీ కేంద్రంగా చేయాలని గ్రామసభలో వినతి పత్రం ఇస్తున్న నాయకులు



మేడ్చల్ మండలం మునిరాబాద్‌లో గ్రామసభ

మేడ్చల్: హైదరాబాద్ మహా నగర విస్తరణలో భాగంగా శివారు గ్రామ పంచాయతీలను సమీప మున్సిపాలిటీలు, జీహెచ్‌ఎంసీలో విలీనం చేయాలని ప్రభుత్వం ప్రతిపాదనలు చేయడంతో సబ్ కమిటీ మంత్రుల సూచన మేరకు మేడ్చల్ నియోజకవర్గంలోని ప్రతిపాదిత విలీన గ్రామాల ప్రజల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి.

- మేడ్చల్ నియోజకవర్గంలోని మేడ్చల్ మండలానికి చెందిన రాయిలాపూర్, పూడూర్ గ్రామాలను మేడ్చల్ మున్సిపాలిటీలో, గౌడవెల్లి, మునీరాబాద్ గ్రామాలను గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో విలీనం చేయాలని ప్రతిపాదించారు. కీసర మండలంలో కీసర, రాంపల్లి దాయర, కరీంగూడ, గోధుమకుంట గ్రామాలను నాగారం మున్సిపాలిటీలో, దమ్మాయిగూడలో చీర్యాల, తిమ్మాయిపల్లి, నర్సంపల్లి, యాదాంగర్‌పల్లి గ్రామాలను విలీనం చేయాలని ప్రతిపాదనలు చేశారు.
- శామీర్‌పేట్ మండలంలో శామీర్‌పేట్, బొమ్మరాసిపేట, బాబగూడ గ్రామాలను తూంకుంటలో విలీనం చేయాలని ప్రతిపాదించారు.
- ఘట్‌కేసర్ మండలంలో కాచవానిసింగారం, ప్రతాపసింగారం, కొర్రెముల్, వెంకటాపూర్, చౌదరిగూడ గ్రామాలను జీహెచ్‌ఎంసీలో విలీనం చేయాలని, ఎదులాబాద్, మర్పల్లిగూడ, ఘనాపూర్ గ్రామాలను ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో విలీనం చేయాలని ప్రతిపాదించారు. మొత్తంగా మేడ్చల్ మండంలో 4, కీసర మండలంలో 8, ఘట్‌కేసర్ మండలంలో 8 గ్రామాలు శామీర్‌పేట్ మండలంలో 3 గ్రామాలు నాలుగు మండలాల్లో కలిపి 31 పంచాయతీల్లో 23 పంచాయతీలను విలీనం చేయడానికి సన్నాహాలు పప్రారంభించారు.

గ్రామసభలు...

- నియోజకవర్గంలోని ప్రతిపాదిత విలీన గ్రామాలలో మంత్రుల సబ్‌కమిటీ ఆదేశాలతో శుక్రవారం గ్రామాల కార్యదర్శుల నేతృత్వంలో గ్రామ సభలు నిర్వహించి ప్రజల అభిప్రాయాలను తీసుకున్నారు. మెజారిటీ గ్రామాల ప్రజలు మున్సిపాలిటీల్లో, జీహెచ్‌ఎంసీలో విలీనం చేయడం వైపు మొగ్గుచూపారు. మేడ్చల్ మండలంలోని పూడూర్, రాయిలాపూర్, గ్రామాలను మేడ్చల్ మున్సిపాలిటీలో విలీనం చేయడాన్ని వ్యతిరేకించగా గౌడవెల్లి, మునీరాబాద్ గ్రామాల ప్రజలు పెద్దగా అభ్యంతరాలు చెప్పలేదు.
- శామీర్‌పేట్ మండలంలోని శామీర్‌పేట్, బాబగూడ, బొమ్మరాసిపేట గ్రామాల ప్రజలు నుంచి విలీనంపై ఆసక్తి కనబడలేదు. కీసర మండలంలోని కీసర, చిర్యాల, యాద్గార్‌పల్లి గ్రామాలను కలిపి కీసర మున్సిపాలిటీగా మార్చాలని కోరగా మిగతా గ్రామాల వారు విలీనానికి సై అన్నారు. ఘట్‌కేసర్ మండలంలోని మెజారిటీ గ్రామాల ప్రజలు విలీనం వైపు మొగ్గుచూపారు.



కీసర గ్రామసభలో పాల్గొన్న వివిధ పార్టీల నేతలు



అవుషాపూర్ గ్రామసభలో పాల్గొన్న నాయకులు

గ్రామ పంచాయతీలుగా ఉంచలేని పక్షంలో మున్సిపాలిటీలుగా మార్చాలి...

- సమీప మున్సిపాలిటీలో విలీనం చేయడం, జీహెచ్‌ఎంసీలో విలీనం చేయడం కన్నా ప్రత్యేక మున్సిపాలిటీలు చేయాలన్న అభిప్రాయాలు ప్రజల నుంచి గ్రామసభల్లో వ్యక్తం అయ్యాయి. పూడూర్‌ను సమీప గ్రామాలతో కలిపి, కీసరను సమీప గ్రామాలతో కలిపి, అవుషాపూర్ పరిసర గ్రామాలతో కలిపి మున్సిపాలిటీలుగా చేయాలని ప్రజలు తమ అభిప్రాయాలను అధికారులకు తెలియజేశారు. మండల కేంద్రాలుగా ఉన్న కీసర, శామీర్‌పేటలను మున్సిపాలిటీ కేంద్రాలుగా ఉంచాలనే అభిప్రాయాలను ఆయ ప్రాంతాల నాయకులు వ్యక్తం చేశారు. మొత్తం మీద మేడ్చల్ నియోజకవర్గ గ్రామాల్లో విలీన రాజకీయం జోరుగా నడుస్తుంది.